ప్రజాశక్తి

గురువారం 16 అక్టోబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్




కృష్ణా

నేటికీ అందని పాఠ్య పుస్తకాలు !

● ఆందోళనలో విద్యార్థులు ● మెరుగైన ఫలితాలు ఎలా సాధ్యం ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : "కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను తీర్చిదిద్దుతాం... ప్రభుత్వ విద్య బలోపేతానికి కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది" అని కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలకూ, ఆచరణలో చేతలకు ఎక్కడా పొంతన ఉండటం లేదు. ఈ విద్యా సంవత్సరంలో పాఠ్య పుస్తకాల పంపిణీ తీరే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై పలు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2024 -25 విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు అవుతోంది. అయినా కృష్ణాజిల్లాలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు నేటికీ పూర్తి స్థాయిలో అందలేదు. దీంతో పాఠశాలల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పుస్తకాల పంపిణీపై సంబంధిత అధికారుల వద్ద సమగ్ర సమాచారం కూడా లేకపోవడం గమనార్హం. ఓ వైపు పుస్తకాలు అందక ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతుంటే అధికారుల తీరు మాత్రం గందరగోళానికి గురిచేసేలా ఉంది. పుస్తకాలన్నీ పంపిణీ చేశామని ఓ అధికారి చెబుతుంటే, మండల కేంద్రాల్లో ఉన్నాయని, పాఠశాలలకు పంపుతున్నామని మరో అధికారి చెబుతున్నారు. పుస్తకాల పంపిణీయే ఇలా ఉంటే, సర్వేపల్లి కిట్ల పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఏమీలేదు. ఇవి కూడా ఇంకా విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందలేదు. పుస్తకాలనే సరిగా పంపిణీ చేయలేని ప్రభుత్వం ఇక విద్యా వ్యవస్థను ఏ విధంగా బలోపేతం చేస్తుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈఏడాది జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 13,711 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నట్లు విద్యాశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా వీరికి గణితం సెమిస్టర్-2 పుస్తకాలు ఇంకా అందలేదు. మరోవైపు విద్యాశాఖ అధికారులు మాత్రం పదో తరగతి విద్యార్థులకు నవంబరులోపు సిలబస్ పూర్తి చేయాలని, డిసెంబర్ 5 నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో పూర్తి



స్థాయిలో పుస్తకాలు లేకుండా ఈ లక్ష్యాన్ని ఎలా సాధించాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. అంతేగాక గణితం పుస్తకాలు విద్యార్థులకు అందకపోయినా రికార్డుల్లో అందరికీ అందినట్లు చూపాలని మండల విద్యాశాఖాధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిసింది. దీంతో పుస్తకాలు ఇచ్చినట్లు వేలిముద్రలు వేయించామ పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. అంతేగాక అధికారుల తీరు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

నోటు పుస్తకాల పంపిణీ వరకే మా బాధ్యత

సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కుముదిని సింగ్

జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ వరకే మా శాఖ బాధ్యత. టెక్స్ట్ పుస్తకాల పంపిణీ బాధ్యత మాదికాదు.

పొంతన లేని అధికారుల లెక్కలు

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీపై విద్యాశాఖ చెబుతున్న లెక్కలు పలు అనుమానాలకు తావిస్తోంది. కృష్ణాజిల్లాలో ఈ ఏడాది 1,09,350 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే సెమిస్టర్-2కు మొత్తం 2,84,743 పుస్తకాలకు అధికారులు ఇండెంట్ పంపారు. దీనిలో మొదటి విడతలో 2,03,118 పుస్తకాలు, రెండో విడతలో 81,786 పుస్తకాలు మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరినట్లు లెక్కలు ఉన్నాయి. విద్యాశాఖ సమగ్ర శిక్ష కార్యాలయంలో పుస్తకాల పంపిణీ పూర్తయినట్లు రికార్డులు ఉన్నప్పటికీ, వాస్తవంగా పదో తరగతి విద్యార్థుల వద్ద గణితశాస్త్రం సెమిస్టర్-2 పుస్తకాలు లేవనేది బహిరంగ రహస్యమే. అలాగే వేలాది మంది ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకూ నేటికీ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదు. అలాగే జిల్లాలో ఉన్న ఐదు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకష్ణన్ కిట్లు అందలేదు.

అన్ని పాఠ్య పుస్తకాలు సరఫరా చేశాం

పంపిణీ మేనేజర్ ఆంజనేయులు

జిల్లాకు అవసరమైన పాఠ్య పుస్తకాలన్నీ ఇండెంట్ ప్రకారం సరఫరా చేశాం. వీటిని మండలాలకు పంపడం వరకే మా బాధ్యత. ఆ తర్వాత ఎంఇఒలు బాధ్యత వహిస్తారు.

అసత్య ప్రచారంపై చర్యలు తీసుకోండి

సిపి కార్యాలయంలో జోగి ఫిర్యాదు

విజయవాడ : నకిలీ మద్యం కేసుకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న జనార్ధన్‌తో తాను ఛాటింగ్ చేసినట్లు సోషల్ మీడియా, కొన్ని ఇతర మీడియాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసిపి నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్ విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. జోగి రమేష్‌తో పాటు ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, వరదు కల్యాణి, రమేష్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, ఎం.వి.రామచంద్రా రెడ్డి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, టిజెఆర్.సుధాకర్ బాబు తదితరులు సిపి కార్యాలయానికి వెళ్లారు. జనార్ధన్ రావుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, నకిలీ మద్యం దందాలో కుట్రపూరితంగా తన పేరును వాడుతూ బురదచల్లుతున్నారని జోగి రమేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని అడ్డం పెట్టుకుని వైసిపి ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సిపి కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పోస్టులకు దరఖాస్తులు

విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహిస్తున్న ఐసిపిఎస్, ఎస్ఎఎ అండ్ చిల్డ్రన్ హోమ్స్‌లో పలు పోస్టుల్లో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు స్థానిక అర్హులైన 18 నుండి 42 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారిణి షేక్ రుక్సానా సుల్తాన బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిఇస, ఇడబ్ల్యుఎస్ మహిళలకు ఐదేళ్ళ, వికలాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుందని తెలిపారు. అకౌంటెంట్-1, అసిస్టెంట్ కం డేటా ఎంట్రీ (మిగతా 2లో)



కేసు నుండి విముక్తి పొందిన సిపిఎం, ప్రజా సంఘాల నేతలు బాబురావు, రవి, సత్యబాబు తదితరులు

అమరావతి రాజధాని కోసం ఉద్యమించిన

సిపిఎం, ప్రజాసంఘాల నేతలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - విజయవాడ : ఎపి రాజధానిగా అమరావతినే కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాలని గత వైసిపి ప్రభుత్వ హయాంలో 2020 ఫిబ్రవరి 14న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విజయవాడ ధర్నా చౌక్‌లో దీక్షలు చేపట్టిన సిపిఎం నేతలపై మోపిన అక్రమ కేసులను బుధవారం కోర్టు కొట్టివేసింది. 48 గంటలపాటు నిరాహార దీక్షలు చేపట్టిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావుతోపాటు సిపిఎం, సిఐటియు, ఐద్వాకు చెందిన మరో 9 మందిపై క్రైమ్ నెంబర్ 70/2020, ఐపిసి సెక్షన్ 188, 143, వి/డబ్ల్యు 149 ఐపిసి సెక్షన్ 30 కింద మోపిన కేసును విజయవాడ సెకండ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేసి వారిని నిర్దోషులుగా ప్రకటించింది. ఐదేళ్లన్నరేళ్లపాటు కోర్టులో సిపిఎం నేతలు న్యాయపోరాటం చేశారు. నేతల తరపున ఐలు జాతీయ కార్యనిర్వాహణ అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ (ఎస్ఆర్‌పి) న్యాయవాదుల బందం సప్పా రమేష్., ప్రశాంతి ఈ కేసును వాదించారు. వారికి నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ అప్పటి వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి, అమరావతి రాజధాని ఉద్యమాన్ని అణిచివేయాలని కుట్రలు చేసిందన్నారు. ఆ తర్వాత అమరావతే రాజధానిగా ఉంటుందని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా తమపై వైసిపి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులు రద్దు చేయలేదని విమర్శించారు. ఇది రాజధాని ఉద్యమకారులకు వెన్నుపోటు పొడవడమే అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ రాష్ట్ర రాజధాని నిర్మాణానికి అవసరమై నిధులు విడుదల చేయకుండా మోసగిస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో సిపిఎం నాయకులు బోయి సత్యబాబు, కె.దుర్గారావు, టి.ప్రవీణ్, రాజధాని అభివద్ధి కమిటీ కన్వీనర్ ఎం.రవి, సిఐటియు జిల్లా నాయకులు ఎం.సీతారాములు. ఐద్వా జిల్లా కార్యదర్శి కె.సరోజ, కష్ణలంక ప్రాంత నాయకులు వి.రంగారావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కె మీరావలి, ఎ.పెద్దిరాజు తదితరులపై పోలీసులు కేసులు పెట్టారు.

ఇటు ప్రజలపై భారం... అటు ప్రభుత్వానికి ఆదాయం...

● పెరిగిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం ● భూ లావాదేవీలపై ప్రభావం
● ఫీజుల పెంపుదలే కారణం !



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ఫీజులు ప్రధాన ఆదాయ వనరులుగా మారాయి. ప్రతి ఏటా ప్రభుత్వం భూమి విలువ పెంచుతూ పోతోంది. దీంతో 100 గజాల ఇంటి స్థలమో, ఎకరం వ్యవసాయ భూమో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు ఫీజులు భారమవు తున్నాయి. ప్రభుత్వాలు మాత్రం తమ ఆదాయం పెంచుకుంటున్నాయి. 2025-26లో అర్ధ సంవత్సరం (ఏప్రిల్ 1 - సెప్టెంబర్ 30)నకు సంబంధించి కృష్ణాజిల్లాలో రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయాన్ని పరిశీలిస్తే... ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుండి కృష్ణాజిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని నగరాలు, పట్టణాల్లో గజానికి వెయ్యి రూపాయలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎకరానికి రెండు లక్షల రూపాయల వరకు భూమి విలువ పెంచారు. పెరిగిన విలువ ఆధారంగా భూ క్రయ విక్రయాలపై 7.5 శాతం. మార్టిగేజ్‌కు 0.6 శాతం, కుటుంబ సభ్యుల మధ్య గిఫ్ట్ డీడ్‌కు 2.5 శాతం, ఇతరులు మధ్య గిఫ్టుడీడ్‌కు 3.5 శాతం ఫీజు చెల్లించి స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2025-26లో నగరపాలక సంస్థలు, పట్టణాల్లో 100 గజాలు క్రయ విక్రయాల (సేల్ డీడ్) రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి రూ.7,500, గ్రామీణ ప్రాంతాల్లో ఎకరం రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి రూ.15 వేల వరకు అదనంగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే గతంతో పోలిస్తే గత ఆరు నెలల్లో ఆదాయం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఆరునెలల ఆదాయ లక్ష్యం 293.54 కోట్లు 54 లక్షల 74 వేలు రూపాయలు. అయితే 255 కోట్ల 26 లక్షల 42 వేల రూపాయలు అంటే 86.96 శాతం ఆదాయం సమకూరింది. గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 210 కోట్లు 47 లక్షల 37 వేల రూపాయల ఆదాయం మాత్రమే సమకూరింది. గత ఆర్థిక సంవత్సరంకన్నా ఈసారి రూ. 44 కోట్లు 79 లక్షల 5 వేల రూపాయల ఆదాయం పెరిగింది. అయితే లక్ష్యానికన్నా రూ.38 కోట్లు 28 లక్షల 32 వేల రూపాయలు (మిగతా 2లో)

రఘుపతి వెంకయ్య జయంతి

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ : దేశంలో తొలి సినిమా సష్టికర్త రఘుపతి వెంకయ్యనాయుడు 156వ జయంతి కార్యక్రమం బుధవారం రాత్రి స్థానిక గాంధీనగర్ ఆశిష్ స్టూడియలో మహానటి సావిత్రి సాహిత్య, సాంస్కృతిక కళాపీఠం, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక సంఘాల గాయనీ గాయకులతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహ్లాదంగా సాగింది. విష్ణుప్రియ, వి.కామేశ్వరి, లక్ష్మణ్ నాయక్, కామేశ్వరి, జయప్రభ, మధు, శ్యాం ప్రసాద్ తదితర గాయనీ గాయకులు పలు చిత్రాల్లోని సోలో, డ్యూయెట్ సాంగ్స్ వినసొంపుగా పాడారు. కార్యక్రమాన్ని డా. పరుచూరి విజయలక్ష్మి పర్యవేక్షించారు.



కౌతా పూర్ణానంద కళా వేదికపై...

శ్రీ శుభాంజలి (ఘంటసాల గానామతం - 8) మధుర స్వరాలు కార్యక్రమం గాంధీనగర్ కౌతా పూర్ణానంద కళా వేదికపై జనరంజకంగా సాగింది. చావా నరసింహారావు సౌజన్యంతో జరిగిన కార్యక్రమానికి డ్రీమ్ ఆడియో పరిపుష్టి కలిగించింది. గాయనీ గాయకులు మేకల పురుషోత్తమ ప్రసాద్ (శ్రీ శుభాంజలి కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు), మల్లేశ్వరి, డా.అమలారాణి వివిధ చిత్రాల్లోని పాటలు ఆహ్లాదంగా ఆలపించారు.



ఆపరేషన్లలో అత్యంత కీలకం 'మత్తు'

నేడు ప్రపంచ మత్తు (ఎనస్తీషియా) దినం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అమెరికాలోని బోస్టన్లోని మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌లో 1846 అక్టోబర్ 16వ తేదీన ఓ 20 ఏళ్ల యువకుడికి మెడ వద్ద ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. సాధారణంగా ఆపరేషన్ చేస్తే ఆ రోగి దానిని తట్టుకోలేక పెద్ద రభసే చేస్తాడు. కానీ డాక్టర్ విలియం థామస్ గ్రీన్ మార్టన్.. ఆ రోగితో ఈథర్ వాసన పీల్చించాడు. వెంటనే డాక్టర్ వారెన్ టకటకా ఆపరేషన్ ప్రారంభించాడు. దీంతో ఆపరేషన్ సమయంలో ఆ యువకుడికి ఏ బాధా కలగలేదు. ఏదో మత్తులోకంలో ఉన్నాడు. కొద్దినిమిషాల్లోనే ఆపరేషన్ పూర్తయిపోయింది. డాక్టర్ వారెన్ తన కళ్లను తానే నమ్మలేక.. 'ఇదేమీ కనికట్టు కాదుగదా..!' అన్నాడు. అలా వైద్య రంగంలో ఊపిరిపోసుకుంది ఓ సరికొత్త అధ్యాయం! అంతకు ముందు ఆపరేషన్ అంటే ప్రాణాలు రక్షించేందుకు చేసే ఓ చివరి ప్రయత్నంగా ఉండేది. రోగికి అదో భయంకరమైన అనుభవం. శరీరాన్ని కోసి ఆపరేషన్ చేస్తున్నప్పుడు.. రోగులు బాధతో విలవిల్లాడిపోతుంటే కదలకుండా బలంగా నొక్కిపట్టుకునేవాళ్లు. నొప్పి తట్టుకోలేక కొందరురోగులు ఏడ్చిఏడ్చి స్పృహ తప్పేవారు. కొందరు చనిపోయేవారు కూడా! పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. అంతేగాకుండా రోగి వైపు నుంచి సహకారం ఉండదు కాబట్టి సర్జన్‌కు కూడా ఆపరేషన్ చేయడం చాలా కష్టతరంగా ఉండేది. అయితే 'మత్తు' మందులు ఆవిష్కారం ఈ పరిస్థితి మొత్తాన్ని మార్చేసింది. తొలినాళ్లలో రోగికి నొప్పి తెలియకుండా ఉండేందుకు రకరకాల వేరు మందులు, ఆకు పసర్ల వంటివి ఎన్నో ప్రయత్నించారు. ఆ తర్వాత ఆల్కహాల్, నల్లమందు, ఈథర్, క్లోరోఫాం వంటివి వచ్చాయి.


మత్తు రకరకాలు ! : రోగి ఆరోగ్య స్థితి, చేయాల్సిన ఆపరేషన్ల ఆధారంగా మత్తు డాక్టర్లు ఓ నిర్ధారణకు వస్తారు. ఎటువంటి మత్తు ఇస్తే మంచిదో ముందుగానే రోగితో చర్చిస్తారు. ఇప్పుడు ఆపరేషన్‌ను బట్టి, అవసరాన్ని బట్టి మత్తు రకరకాలుగా ఇచ్చే వెసులుబాటు వచ్చింది.

1.జనరల్ మత్తు : నరం ఇంజక్షన్లు, వాసన మందుల ద్వారా ఇచ్చే ఈ రకం మత్తు-రోగిని పూర్తిగా మత్తులోకి తీసుకెళుతుంది. రోగికి నొప్పి తెలియదు. అసలు తమ చుట్టూ ఏం జరుగుతోందీ ? తమకు ఏం చేస్తున్నదీ వారికి తెలియదు. సాధారణంగా ఇంజక్షన్తో మత్తులోకి తీసుకువెళ్లి, ఆ తర్వాత ఆపరేషన్ జరిగినంత సేపూ నైట్రస్ ఆక్సైడ్ (లాఫింగ్ గ్యాస్) వంటి వాయువుల సాయంతో మత్తులో ఉంచుతారు. ఈరకం మత్తు ఎలాంటి ఆపరేషన్‌కైనా ఇవ్వొచ్చు. కొందరికి ఇదే అవసరమవుతుంది. అయితే మిగతా రకాలతో పోలిస్తే దీనికయ్యే ఖర్చు కొద్దిగా ఎక్కువ. దీనివల్ల ఇతరత్రా దుష్ప్రభావాలు ఉండొచ్చు. కానీ ఇది చాలా అరుదు.



- డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు. ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తియాలజిస్ట్స్

2.వెన్నుకు ఇచ్చే మత్తు (స్పైనల్) : బొడ్డు దాటి.. కింది భాగానికి ఆపరేషన్ చేయాల్సి వచ్చినప్పుడు ఎవరికైనా ఈరకం మత్తు పనికొస్తుంది. దీనికోసం వీపు కింద భాగంలో, వెన్ను మీద, వెన్నుపాము నాడుల చుట్టూ ఉండే పొరలోకి మందును ఇంజెక్ట్ చేస్తారు. దీంతో అక్కడి నుంచి కిందికి వెళ్లే నాడులన్నీ మొద్దుబారిపోయి.. బొడ్డు కింది భాగంలో ఏ ఆపరేషన్ చేసినా నొప్పి తెలియదు. అయితే రోగి మేల్కొనే ఉంటారు, అన్నీ ఆ రోగికి తెలుస్తూనే ఉంటాయి. దీనికయ్యే ఖర్చు తక్కువ. దీంతో దుష్ప్రభావాలూ చాలా తక్కువ. అత్యవసరంగా సిజేరియన్లు వంటివి చేసేటప్పుడు ఇది బాగా ఉపకరిస్తుంది.



3.ఎపిడ్యూరల్ మత్తు : ఇది కూడా వెన్ను మీద ఇచ్చే ఇంజక్షనే. ఇది ఎక్కువసేపు నొప్పి తెలియకుండా ఉండటానికి ఉపకరిస్తుంది. ఇందుకోసం వెన్ను మీద సన్నటి గొట్టం ద్వారా మందు ఎక్కిస్తూనే ఉంటారు. కాన్పు సమయంలో నొప్పులు తెలియకుండానూ, సిజేరియన్లు చేసేటప్పుడూ ఈరకం మత్తు ఇవ్వటం చాలాకాలంగా అమల్లో ఉంది. మోకాళు ,, తుంటి మార్పిడి ఆపరేషన్లలోనూ, రక్తనాళాల ఆపరేషన్లలోనూ ఈరకం మత్తుతో అదనపు ప్రయోజనాలుంటాయి. ఈరకం మత్తు ఇవ్వాలంటే రోగి సహకారం తప్పనిసరి.

4.లోకల్ మత్తు : ఆపరేషన్ చేస్తున్న చోట ఇంజక్షన్ ఇవ్వటం ద్వారా ఆ కాస్త మేర నొప్పి తెలియకుండా చేసే విధానం ఇది. ఇంజక్షన్ ఇచ్చిన ప్రాంతంలోని నాడులు మొద్దుబారిపోయి, ఆపరేషన్ చేసేటప్పుడు నొప్పి తెలియదు. చేతుల మీద, కాళ్ల మీద, శరీరంలోని మరేదైనా ఒక ప్రాంతంలో ఆపరేషన్ చెయ్యాల్సి వస్తే ఇది బాగా ఉపకరిస్తుంది.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పోస్టులకు దరఖాస్తులు

ఆపరేటర్-1, పార్ట్ టైం డాక్టర్-1, చౌకీదారు కం నైట్ వాచ్ విమెన్-1, ఆయా-6, ఎడ్యుకేటర్ పార్ట్ టైం-1, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ టీచర్ పార్ట్ టైం -2, పీటీ ఇన్స్ట్రక్చర్ కం యోగా టీచర్ పార్ట్ టైం-2, కుక్-1, హెల్పర్-1, హౌస్ కీపర్-2, హెల్పర్ కం నైట్ వాచ్ విమెన్-1 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13 నుండి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆసక్తిగల స్థానిక మహిళా అభ్యర్థులు ntr.ap.gov.in నుండి దరఖాస్తులు డౌన్లోడు చేసుకొని పూర్తిచేసి అవసరమైన ధృవపత్రాల నకళ్లను గజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించి డోర్ నెంబర్ 6-93, కార్మెల్ చర్చి ఎదురురోడ్, కానూరు, విజయవాడ చిరునామాలోని తమ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని కోరారు.

ఇటు ప్రజలపై భారం...

(మొదటి పేజీ తరువాయి)

తక్కువగా వసూలైంది.

నాలుగు కార్యాయాల్లో లక్ష్యానికి మించి ఆదాయం

పామర్రు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో రూ.9 కోట్లా 71 లక్షల 18 వేల లక్ష్యానికిగాను రూ.10 కోట్లా 56 లక్షల 5 వేలు వసూలైంది. 108.74 శాతం వసూలైంది. పెడన సబ్ రిజిస్ట్రార్ పరిధిలో రూ.9 కోట్లా 52 లక్షల 73 వేల లక్ష్యానికిగాను రూ.9 కోట్లా 56 లక్షల 27 వేలు వసూలైంది. ఇది 100. 37 శాతం వసూలు. బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ పరిధిలో రూ.5 కోట్లా 71 లక్షల 99 వేలకుగాను రూ.5 కోట్లా 85 లక్షల 33 వేలు వసూలైంది. ఇది 102.53 శాతం వసూలుగా ఉంది. కానుమోలు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో రూ.10 కోట్లా 76 లక్షల 9 వేలకుగాను రూ.12 కోట్లా 98 లక్షల 97 వేలు. ఇది 120.70 శాతంగా నమోదైంది.

అవనిగడ్డలో నిషేద భూముల ఎఫెక్టు

22 ఏ సబ్ సెక్షన్ ఇ లోని షరతుల గల పట్టా భూములపై కూటమి ప్రభుత్వం తిరిగి నిషేధం విధించింది. దీంతో కోడూరు, నాగాయలంక మండలాల పరిధిలోని 18,600 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. అవనిగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆదాయంపై దీని ప్రభావం కనబడుతోంది. ఈ కార్యాలయ ఆదాయ లక్ష్యం రూ.9 కోట్లా 49 లక్షల 61 వేలుకాగా, రూ.6 కోట్లా 49 లక్షల 19 వేలు (68.36 శాతం) ఆదాచం మాత్రమే సమకూరింది. ఇది లక్ష్యానికన్నా రూ.3 కోట్లా 34 వేలు తక్కువగా ఉంది.

కంకిపాడు, గన్నవరంలో అత్యధిక ఆదాయం

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ పరిసర ప్రాంతాల్లోని కంకిపాడు, గన్నవరం రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరింది. కంకిపాడులో రూ.62 కోట్లా 91 లక్షల 06 వేలు, గన్నవరంలో రూ.52 కోట్లా 32 లక్షల 33 వేల ఆదాయం సమకూరింది. కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.29 కోట్లా 17 లక్షల 20 వేలు, గుడివాడలో రూ.23 కోట్లా 95 లక్షల 82 వేలు, ఉయ్యూరులో రూ.22 కోట్లా 10 లక్షల 6 వేల ఆదాయం సమకూరింది.

వ్యవసాయ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు


మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-మొవ్వ: వ్యవసాయ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలని, ఉపాధి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా సమావేశం చినముత్తేవి గ్రామంలోని అజయ్‌కుమార్ భవనంలో జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలు రూపొందించుకుని పేద ప్రజలను పట్టించుకోవటంలేదని అన్నారు. వ్యవసాయ భూములను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాక ముందు పేద ప్రజలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం ఇస్తానని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. జగనన్న కాలనీల్లో పేరుకుపోయిన మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమైందన్నారు. వ్యవసాయ కార్మికులు పనుల్లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని, వలసల నివారణకు పేద ప్రజలకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పనికి రోజుకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అజ్మీర్ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కోడూరు: మారుతున్న కాలాన్ని బట్టి ఆరోగ్యం పట్ల బాధ్యత తీసుకుని కనీసం ఏడాదికి ఒకసారైనా ఫుల్ బాడీ చెకప్ చేయించుకోవాలని రేపల్లెకు చెందిన సంజీవని ఎమర్జెన్సీ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ శిశు వైద్య నిపుణులు వసంతం వీరరాఘవయ్య అన్నారు. బుధవారం కోడూరులోని గోపాలకృష్ణ క్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెకు సంబంధించిన సమస్యలు, లివర్ సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 200 మంది వైద్య సేవలు పొందారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఎస్సీ సాయి దుర్గ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-బంటుమిల్లి: బంటుమిల్లి రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం ఆర్డిఓ కె.స్వాతి మాట్లాడారు. అనంతరం వృద్ధుల సంఘం నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ పట్ల వృద్ధులకు అవగాహన కల్పించాలన్నారు. వృద్ధులకు అన్నిచోట్ల ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. లక్ష్మీపురం నుండి పూలగం రామ తులసి, జయపురం, రామవరపు మోడీ, పల్లికొండ వారి మోడీ, చిన్న పాండ్రాక, బాసినపాడులో నుండి పలువురు వద్దులు ఆర్డీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. దీనిపై సత్వరమే చర్యలు తీసుకోవాలంటూ రెండు మండలాల తాసిల్దార్లకు ఆర్డిఓ ఆదేశాలు జారీ చేశారు. అలాగే విజయవాడకు చెందిన ప్రముఖ యోగ, ఆయుర్వేద డాక్టర్ మాకల సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు వంద మందికి ఆక్యుపంచర్ స్టిక్స్‌ను అందించారు. అనంతరం రెండు మండలాల్లోని పలువురు వయోవృద్ధులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకులు చండిక గంగాజలరావు, రెండు మండలాల తహసిల్దార్లు కాగిత పూర్ణచంద్రరావు, లక్క ప్రగడ శశికుమార్, ఎంపీడీవో నీరజాక్షి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యాళ్ల శ్యాంబాబు, కృష్ణారావు, కారుమూరి రాజేంద్రప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న వృద్ధులు



నూతన ఉపాధ్యాయులకు స్వాగతం

ప్రజాశక్తి-ఉంగుటూరు: మండలంలోని వివిధ పాఠశాలల్లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సీతారామయ్య, మండల నాయకులు రాజశేఖర్ స్వాగతం తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌ను రూపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాలని, ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నిరంతరం అండగా నిలుస్తుందని అన్నారు.

హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి గ్రామంలోని శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలోని హుండీలను బుధవారం లెక్కించారు. 97 రోజులకు రూ.97,50,092 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయకార్యనిర్వహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదన్‌రావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎన్.వి.సాంబశివరావు, మచిలీపట్నం డివిజన్ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-పామర్రు: బాల్య దశ నుండి పోషక విలువలు కలిగిన ఆహారం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయకుమారి సూచించారు. 8వ రాష్ట్రీయ పోషణ మహెూత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ హైస్కూల్లో పోషక ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని గుర్తించడం మరియు తల్లిపాల ఆవశ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పామర్రు సూపర్వైజర్ సత్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : యార్లగడ్డ



ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం)

గన్నవరం నియోజకవర్గంలోనీ 84 గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేదని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వచ్చే ఆరు వారాలలో పరిష్కరించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకటరావు జిల్లా అధికారులకు సూచించారు. బుధవారం గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ నియోజకవర్గంలో కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని కలెక్టర్ వేసిన పర్యవేక్షణ కమిటీ పరిరక్షించాలన్నారు. ఉంగుటూరు బాపులపాడు మండలాల్లో ఇంకా డ్రోన్లు ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రశ్నించారు. గోకులం పనులకు సంబంధించి 414 దరఖాస్తులు అందితే 157 మాత్రమే మంజూరయ్యాయని మిగిలిన దరఖాస్తులు పరిశీలించాలన్నారు. ఇటీవల వర్షాలకు నియోజకవర్గంలో కొన్ని రహదారులు దెబ్బతిన్నాయని వాటిని తనిఖీ చేసి అంచనాలు సిద్ధం చేయాలని, అత్యవసరంగా బాగు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఎలాంటి కొరత లేదన్నారు. ఈ సంవత్సరం 30 ఎకరాల్లో వెదురు బొంగుల పంట ప్రోత్సహించాల్సి ఉండగా సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో ఇంకా రైతులు ముందుకు రావడంలేదని ఉద్యాన అధికారి జ్యోతి సమాధానం చెప్పారు. ఈ సమావేశంలో గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, గన్నవరం నియోజకవర్గ ప్రత్యేక అధికారి షాహిద్ బాబు, గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గూడవల్లి నరసింహారావు, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, తహసిల్దారు శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత అధికారులు పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-ఉంగుటూరు: విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలిగించడానికి, విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంపొందించడానికి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు చెకుముకి జిల్లా కన్వీనర్, జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు షేక్ ఇమామ్ తెలిపారు. బుధవారం మండలంలోని ముస్తాబాద నవభారత్ పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న పాఠశాల స్థాయిలో, నవంబర్ 1న మండల స్థాయిలో, నవంబర్ 23న జిల్లా స్థాయిలో, డిసెంబర్ 12, 13, 14 తేదీలలో రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7799985786 ఫోన్ నెంబర్‌కు సంప్రదించవచ్చని చెప్పారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థాన జీర్ణోద్ధరణ పనులకు బుధవారం రామిరెడ్డి మురళీమోహన్ రెడ్డి, మంగలక్ష్మి దంపతులు రూ.10,116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెహ్రూ పశువుల సంత కమిటీ ఛైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి, బాబి, నాని తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు: పోరంకిలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మందికి సుమారు 11 లక్షల 85 వేల 449 రూపాయల సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు.



రైతులకు సాంకేతిక సాధనాలపై శిక్షణ

ప్రజాశక్తి-చల్లపల్లి: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవస్థాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చల్లపల్లి మండలం వక్కలగడ్డ సచివాలయం లో బుధవారం రైతులకు ఐసిటి సాంకేతిక సాధనాల వినియోగం మరియు ప్రస్తుత వరిలో కాలానుగుణంగా తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై శిక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ బి.సుధారాణి మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ విధానాల్లో సాంకేతిక పరంగా వచ్చిన మార్పులకు అనుగుణంగా రైతులు సమాచారం పొందాలని అందుబాటులో ఉన్న సాంకేతిక సాధనాలు ఐసిటి సాధనాలు ద్వారా (వాట్సాప్) సామాజిక మాధ్యమాలు సంబంధించి వివరాలు తెలుసుకోవాలన్నారు శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ మాట్లాడుతూ రైతులకు చేరువలో మొబైల్ యాప్స్ అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎం. వెంకటలక్ష్మి, చల్లపల్లి ఏవో ఎం.మురళీకృష్ణ, విఏఏ హరిత, రైతులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సమరం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మచిలీపట్నం కేంద్రంగా ఉన్నా ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. బుధవారం మచిలీపట్నం ఎస్సి బాయ్స్ హాస్టల్‌ను సందర్శించిన అనంతరం మాట్లాడుతూ మచిలీపట్నం లో ఉన్న ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కుంటున్నారన్నారు. ముఖ్యంగా దోమలు నివారించడం, వాటి నుండి కాపాడుకోవటానికి దోమ తెరలు, మెస్ డోర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గదుల్లో ఒక ఫ్యాన్లు మాత్రమే ఉండగా, మరొక ఫ్యాన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక్కొక్క రూమ్‌లో పదిమంది విద్యార్థులను ఉండాలని చెప్పడం సరైనది కాదని, అసలే చిన్న రూములు కాబట్టి 10 మంది ఉండడానికి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. మెస్ చార్జీలు నెలకు ఒక్కొక విద్యార్థికి 1500 మాత్రమే చెల్లించడం జరుగుతుందన్నారు. ఆ చార్జీలతో మెనూ అమలు చేయడం సాధ్యం కాదని, ఒకొక విద్యార్థికి రూ.2 వేలు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల కాస్మోనిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు అనేక సమస్యలు చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మచిలీపట్నం మండల కార్యదర్శి ప్రదీప్, జిల్లా కమిటీ సభ్యులు బషీం, మండల కమిటీ సభ్యులు జయకర్, సిఐటియు నాయకులు వై.నరసింహారావు, బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో ఎత్తిపోతల పథకాలు

సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేయాలి : సిపిఎం



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : పశ్చిమ నియోజకవర్గం ఎస్సీ హాస్టల్ వసతులు జైలు కారాగారం కన్నా అధ్వానంగా ఉన్నాయని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బి.సత్యబాబు విమర్శించారు. సిపిఎం పశ్చిమ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో కొత్త పేటలోని మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిపిఎం నేతృత్వంలో సోమవారం సౌమ్య థియేటర్ సమీపంలోని ఎస్‌సి హాస్టల్‌ను సందర్శించినట్లు తెలిపారు. తమ పరిశీలనలో హాస్టల్‌లో ఎస్సి, ఎస్టీ విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. హాస్టల్ ప్రాంగణం చెత్తతో నిండిపోయిందని, మురుగు నీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో దోమల బెడదతో విద్యార్థులకు రాత్రుళ్ళు నిద్ర కరువైందన్నారు. దోమ కాటుతో విషజ్వరాలు సోకే అవకాశం ఉందని, తాగు నీటి సౌకర్యం సదుపాయం సరిగ్గా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద మంది విద్యార్థులకు నాలుగు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హాస్టల్ వాచ్‌మెన్‌కు నెల వారి జీతం అందడం లేదని గుర్తుచేశారు. అధికారులు స్పందించి విద్యార్థుల పౌష్టికాహార లోపాన్ని గుర్తించి తగిన వసతులు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం తరపున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సూరిబాబు, నగరకమిటీ సభ్యులు జి వెంకటావు, కరీముల్లా పాల్గొన్నారు.

యువత భవిష్యత్ నేతలుగా ఎదగాలి



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ గాంధీజీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో బుధవారం కాలిబో ఆల్ అకాడమీ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. వట్టికుటి గ్రూప్ ఆఫ్ కంపెనీ, కాలిబో అకాడమీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ రాజ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పిల్లల ఉన్నత విద్యాభ్యాసం కోసం యువత డిజిటల్ వ్యాపారంలో నైపుణ్యాలను సాధించి, భవిష్యత్ నాయకులుగా ఎదగాలనే లక్ష్యంతో ఈ రోజు సెమినార్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, కాలిబో అకాడమీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గూగుల్ రాకతో రాష్ట్రం అభివృద్ధి

- నగరాల కార్పొరేషన్ చైర్మన్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : రాష్ట్ర చరిత్రలోనే 15 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను సాధించడం ఇదే తొలిసారని నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ళ తిరుమలేష్ అన్నారు. విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సుకాసి కిరణ్ తో కలసి మారుపిళ్ళ తిరుమలేష్ మాట్లాడారు. అభివృద్ధి వికేంద్రీకరణ మాటలకే పరిమితం చేయకుండా శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకూ ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. దేశంలోనే ఎఐ హబ్‌ను గూగుల్ క్లౌడ్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయబోతుందని, ఈ డేటా సెంటర్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, వైద్యం, విద్యా రంగాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. సమావేశం లో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్స్ సుకాసి కిరణ్ కుమార్, బెవర సాయి సుధాకర్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి-వీరులపాడు

కోట్ల రూపాయల ప్రజాధనంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నీటి లభ్యత ఉండి కూడా ఎత్తిపోయలేని స్థితిలో ఎత్తిపోతల పథకాలు ఉండడంతో రైతులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుతానికి నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఎత్తిపోతల పథకాలు సంవత్సరాల తరబడి నిరుపయోగంగా ఉండడంతో నీటి ఎద్దడి సమయంలో సమస్య తలెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఎత్తిపోతల పథకాలను వాడుకలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం దొడ్డ దేవరపాడు గ్రామంలో 15 సంవత్సరాల క్రితం 950 ఎకరాల సాగు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన దొడ్డదేవరపాడు ఎత్తిపోతల పథకం నిర్వహణా లోపం కారణంగా మూలనపడింది. వైరా కట్టలేరులో పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తున్నప్పటికీ ఎత్తిపోతల పోయలేని స్థితిలో దొడ్డదేవరపాడు ఎత్తిపోతల ఉండటంతో రైతులను ఆందోళన కలిగిస్తోంది. సంవత్సరాల తరబడి మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో నీటి ఎద్దడి సమయంలో సమస్య తలెత్తితే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వి అన్నవరం గ్రామంలో ఎత్తిపోతల పథకం తెలంగాణ ప్రాంతం నుండి ప్రవహించే వైరా నది పెద్ద ఎత్తున ప్రవహిస్తుంది. ఎత్తిపోత పథకాలు నిరుపయోగంగా ఉండటం వల్ల



సాగు చేసే పంటలకు ఉపయోగపడట్లేదని రైతులు వాపోతున్నారు. జయంతి గ్రామంలో 1400 ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్మించిన ఎత్తిపోతల పథకం పైప్ లైన్ దెబ్బతినడంతో గ్రామంలో ఉన్న రెండు చెరువులకు నీటి నిల్వ చేసే పరిస్థితి లేదు. దీంతో పంటలకు నీరందక రైతులు నరకయాతన పడుతున్నారు. అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకాలను వాడుకలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

నీర ప్రయోగంగా పరికరాలు

దొడుదేవరపాడు గ్రామంలో రెండు ఎత్తిపోత పథకాలు గత ఐదు సంవత్సరాలు నుండి నిర్వాణ లోపంతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఖరీదైన మోటార్లు ఎలక్ట్రికల్ బోర్డులు నిరుపయోగంగానే ఉన్నాయి. నీటి కోసం నిర్మించిన షెడ్ల వద్ద భారీగా ముళ్ళకంప పెరిగి కనీసం దగ్గరకు కూడా వెళ్లలేని పరిస్థితి పరిస్థితి ఏర్పడింది. ఈ షెడ్లకు ఉన్న డోర్లకు తాళాలు కూడా లేకపోవడంతో ఎలక్ట్రికల్ బోర్డులు, మోటార్ల భద్రత పరిస్థితి ప్రశ్నార్థంగా మారింది.

నీళ్లున్న ఎత్తిపోయలేని ఎత్తిపోత పథకాలు

ఈ రెండు ఎత్తిపోతల పథకాలు దడదేవరపాడు గ్రామ శివారులో వైరా కట్టలేరుపై నిర్మించారు. ఎత్తిపోత పథకాలు నిర్మించిన ప్రదేశంలో నిత్యం నీటి లభ్యత ఉంటుంది. రెండు ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా ఉండడంతో రైతులు సాగు చేసిన పంటలకు కష్టకాలం వచ్చే పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపడితే ఖరీఫ్‌తో పాటు రబీలో ఆరుతడి పంటలు కూడా సాగు చేసుకోవచ్చని రైతులు చెప్తున్నారు

అధికారుల చుట్టూ తిరిగినా ఫలితంలేదు
గోపాలరావు, రైతు, దొడ్డ దేవరపాడు



ఆరు సంవత్సరాల నుండి మరమ్మతులు చేపట్టడం లేదని అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు అందజేశారు. అయినా పట్టించుకోలేదు. ఈ ఏడాది వర్షాలు కురుస్తున్నందు వలన వరి సాగు చేసే రైతులకు ప్రస్తుతం ఇబ్బందులు లేవు. నవంబర్ నాటికి వరి సాగు చేసే రైతులకు నీటి కొరత వచ్చే అవకాశాలు ఉన్నాయి. మరమ్మతులు చేపడితే సాగు చేసిన పంట చేతికి వస్తుంది. లేకుంటే నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

కలాం జయంతి వేడుకలు

విజయవాడ : అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో బుధవారం డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంఎల్‌ఎ బోండా ఉమా మహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలాం చిత్రాలతో విద్యార్థులు వేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం మైనం హుస్సేన్ పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో

పోస్టల్ వారోత్సవాలు ముగింపు సమావేశం, కలాం జయంతి వేడుకలు గవర్నరుపేటలోని ఠాగూర్ స్మార గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, పోస్టల్ స్టోర్స్ డిపో అధికారి అనిల్ కుమార్, మేనేజర్ సింహాద్రి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. పోస్టల్ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. దేశ విదేశాలు విడుదల చేసిన రకరకాల స్టాంపులను ప్రదర్శించారు.

27 మంది వాహనదారులకు జరిమానా

విజయవాడ : మద్యం సేవించి వాహనాలు నడిపిన 27 మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు. 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 27 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని బుధవారం ఆరో అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 27 మందిలో 9 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.1.35 లక్షలు, మిగిలిన 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1.80 లక్షలు జరిమానా విధించారు.

కోతుల నుండి కాపాడాలని వినతి



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కోతుల బెడద నుంచి తమను కాపాడాలని కోరుతూ బుధవారం 45 డివిజన్ ఐద్వా మహిళా నేతలు, సిపిఎం నగర కార్యదర్శి బోయ సత్తిబాబు.. నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ అర్జున్ రావును కార్పొరేషన్‌లోని ఆయన చాంబర్లో కలిసి వినతి పత్రం అందజేశారు. రామరాజ్య నగర్ కొండ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న కోతుల బెడద నుంచి కాపాడేందుకు చర్యలు చేపట్టాలని సీఎంహెచ్ఓను కోరినట్లు ఐద్వా నేతలు ఈ సందర్భంగా తెలియజేశారు. కోతుల నివారణకు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనకు దిగుతామంటూ హెచ్చరించారు. వినతిని సీఎంహెచ్ఓ ని కలిసిన వారిలో 45వ డివిజన్ ఐద్వా మహిళా నేతలు ఎస్ మహలక్ష్మి, కె రమా, డి పుష్ప, కె ఎస్ కనక, ఎస్ నరసమ్మ,బక్క రవణమ్మ ఉన్నారు.

మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి- నందిగామ : పత్తి క్వింటాకు రూ.10 వేల మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతును ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడి యలమందరావు డిమాండ్ చేశారు. బుధవారం నందిగామ మండల పరిధిలోని పల్లగిరి, మాగల్లు, రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ గ్రామాలలో రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు సుబ్బారావు, రైతు సంఘం నాయకులతో కలిసి పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధర క్వింటాకు 10,075 రూపాయలు అందించి ప్రతి రైతును ఆదుకోవాల్సిన అవసరం కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రైతులు కొడవటి వెంకటరామారావు,పోపూరి శ్రీనివాసరావు, అంగడాల శ్రీనివాసరావు, పల్లికంటి కృష్ణంరాజు, పల్లికంటి లాజర్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

తనిష్క్ రివాహ్ కలెక్షన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తనిష్క్ ప్రత్యేక వివాహ ఆభరణాల బ్రాండ్ 'రివాహ్', వారసత్వ హస్తకళల గొప్పతనాన్ని చాటుతూ, ఆధునిక డిజైన్లతో కూడిన అద్భుతమైన పెళ్లి, పండుగ నగల కలెక్షన్‌ను ఆవిష్కరించిందని తనిష్క్ చీఫ్ డిజైన్ ఆఫీసర్ రేవతి కాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి, రాబోయే పెళ్లి ముహూర్తాలను దృష్టిలో ఉంచుకుని, రివాహ్ ఈ కలెక్షన్‌ను అందిస్తోందన్నారు. పెళ్లికి ముందు జరిగే చిన్న చిన్న వేడుకల నుండి, అంగరంగ వైభవంగా జరిగే వివాహ వేడుకల వరకు, ప్రతి సందర్భానికి సరిపోయే ఆభరణాలు ఉన్నాయని తెలిపారు. ఈ సీజన్‌లో సరికొత్త సొబగులు అద్దిన కాసుమాల, ఆలయ ఆభరణాల (టెంపుల్ జువెలరీ) శ్రేణి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోందని తెలిపారు. ఇందులో లేయర్డ్ హారాలు, యాంటిక్ చోకర్లు, పెళ్లి గాజులు, వడ్డాణాలు, ఝుమ్కీలు వంటివి ఉన్నాయని, ప్రతి ఆభరణం యాంటిక్ క్రాఫ్ట్‌మెన్‌షిప్, టెక్స్చర్డ్ బంగారంతో ఎంతో సున్నితంగా రూపొందించబడిందని తెలిపారు.

వడ్డెర సంఘం మండల అధ్యక్షునిగా గంగరాజు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం :

రెడ్డిగూడెం మండల వడ్డెర సంఘం (వడియారాజులు) నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా దేవళ్ళ లక్ష్మీపతి, అధ్యక్షుడుగా గుంజ గంగరాజు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల తెల్లబాబు, కోశాధికారిగా జి గంగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బత్తుల వాసు, ఉపాధ్యక్షులుగా అచ్చి నాగరాజు, ఉప్పుతల గంగరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా డి లక్ష్మీపతిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు బండారు సత్యనారాయణ, పాల్గొన్నారు.

చెస్ ఛాంపియన్లుగా రాణించాలి

ప్రజాశక్తి-కంచికచర్ల : ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ద్వారా మహారాష్ట్ర అహల్యా నగర్‌లో జరిగిన సీనియర్ నేషనల్ ఆర్బిటర్ సెమినార్ ఎగ్జామ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గుజ్జర్లపూడి చెన్న కేశవులుని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం అభినందించారు. నియోజకవర్గ పరిధిలో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ నుండి సీనియర్ నేషనల్ ఆర్బిటర్ అవార్డును చెన్నకేశవులు సాధించటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో ఎంతో మందిని చెస్ ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కోరారు.

రుణ విమోచన పథకాన్ని అమలు చేయాలి

ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు



సభలో మాట్లాడుతున్న హరిబాబు

ప్రజాశక్తి-మోపిదేవి

రాష్ట్రంలోనూ కేరళ తరహా రుణ విమోచన పథకాన్ని అమలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు కోరారు. బుధవారం కౌలు రైతు సంఘం మోపిదేవి మండల రెండో మహాసభ సీనియర్ నాయకులు కాలవ రామారావు అధ్యక్షతన నిర్వహించారు. కౌలురైతు సంఘం నాయకులు పరిచే అంజయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభనుద్దేశించి హరిబాబు మాట్లాడుతూ కేరళ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ అమలు చేసి కూరగాయలతో సహా ప్రతి పంటకు మద్దతు ధర ప్రకటించి అమలు చేస్తుందని, అలాగే ఆంధ్రప్రదేశ్ లో కూడా అమలు చేయాలని తెలిపారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికల ముందు ప్రభుత్వం హామీ ఇచ్చిందని అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూయజమాని సంతకంతో పని లేకుండా గ్రామ సభల ద్వారా కౌలురైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ కౌలు రైతులు అనేక ప్రయాసలు పడి వ్యవసాయం చేస్తున్నారని వారికి సరైన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులుగా పి శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎన్ నాంచారయ్య, కార్యదర్శిగా మరిది సురేష్, జాయింట్ కార్యదర్శిగా బి.గోపాలకృష్ణ, సభ్యులుగా ఎన్ రమేష్, రవీంద్రరావు, బి.రామారావు, ఏడుకొండలు, పివి దుర్గాప్రసాద్, కె.రామారావు, బి.వెంకటేశ్వరరావు, అప్పారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెజవాడ నాగేశ్వరరావు, మద్దాల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0పై ప్రచారం

ప్రజాశక్తి-గుడివాడ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఎస్‌టి సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాయంలోని ప్రజావేదికలో జిఎస్‌టి బ్రోచరును ఆయన విడుదల చేశారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, వ్యాపార దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్ గోకవరపు సునీల్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టిడిపి అబ్జర్వర్ నూకలమ్మ, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, అంగడాల సతీష్, దింట్యాల రాంబాబు, వాసే మురళి, దానేటి సన్యాసిరావు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో నీటి పరీక్షలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలోని పది సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో నీటి నాణ్యతను పరిశీలించే పరీక్షలు నిర్వహించారు. బుధవారం రాకనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ కే తారక రామారావు ఆధ్వర్యంలో వసతి గృహాలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు అందజేస్తున్న తాగునీటిని స్వీకరించి పరీక్షలకు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు ప్రియాంక, పుష్ప దీవెన, భార్గవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సాయికృష్ణ, రాజా, హెల్త్ అసిస్టెంట్ రఘు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయండి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-చల్లపల్లి: స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం చల్లపల్లి మండల మహాసభ గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో పల్లి సుబ్బారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు చేయాలని, ఆక్వా రంగానికి న్యాయం చేయాలని, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్కరణల్లో భాగంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందన్నారు. అభివృద్ధి పేరుతో పంటలు పండే పొలాలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్నారు. భూముల రక్షణకు పోరాటాలు చేయక తప్పదన్నారు. జిల్లా అధ్యక్షులు కోసూరు నాగేంద్ర మాట్లాడుతూ పంటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించి రైతులను, వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయకపోగా భూసేకరణ పేరుతో పొలాలు లాక్కుని రైతాంగానికి అన్యాయం చేస్తున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు




సభలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

యద్దనపూడి మధు మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ గుడివాడలో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఎనిమిది మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొందలపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పల్లి సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా పేరుబోయిన భాగ్యరాజు, సహాయ కార్యదర్శి గోళ్ల సాంబశివరావు, కోశాధికారి వేముల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా నంద్యాల ప్రభు, గొరిపర్తి గోపాలం, మురాల శంకర్రావు ఎన్నికయ్యారు.

కరాటేలో కెకెఆర్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడివాడ : ఇటీవల చెన్నైలో జరిగిన 22వ ఆల్ ఇండియా మవాతికా షిటోరియో ఓపెన్ కరాటే ఛాంపియన్



షిప్ పోటీలలో గుడివాడకు చెందిన డా. కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపల్ పి.లక్ష్మీప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగాద అయన మాట్లాడుతూ ఈ పోటిలలో కె.సాయిచరణ్, కె.కౌషిక్, డి.ఉజ్వల్‌లు తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ సాధించడం గొప్ప విషయన్నారు. ఈ పోటిలలో విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చిన కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, విద్యార్థులను వివిధ సెక్షణల ప్రిన్సిపల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందిచారు.

నిమ్మకూరు అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-పామర్రు: మండలంలోని నిమ్మకూరు గ్రామాన్ని జిల్లా కలెక్టర్ బాలాజీ సందర్శించి గ్రామ సచివాలయ ప్రాంగణంలో పలు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. శ్రీ బుజ్జీశ్వర స్వామి శివాలయం జీర్ణోదరణకు మంజూరైన 1.10 కోట్ల రూపాయల పనులకు సంబంధించిన వివరాలను దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సాంబశివరావును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఉన్నతి కల్పిస్తూ గతంలో 5.69 కోట్ల రూపాయల వ్యయంతో మంజూరైన 30 పడకల ఆసుపత్రి స్థితిగతులను తెలుసుకున్నారు. మండలానికి ఒక సిహెచ్సి ఉండాలని రెండవ సిహెచ్‌సి గ్రామంలో మంజూరు కావడంతో సరైన విధివిధానాలు అందాల్సి ఉందని డిఎంహెచ్వో వెంకటరావు కలెక్టర్కు వివరించారు. ఉండ్రపూడి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నుండి నిమ్మకూరు బస్సు స్టాప్ వరకు 7 కిలోమీటర్ల ఆర్అండ్‌బి రహదారి నిర్మాణానికి సంబంధించి మంజూరైన 3.10 కోట్ల రూపాయల బిటి రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా టెండర్ల ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. వివిధ నిర్మాణ పనులకు మంజూరు ఉత్తర్వులు రావాల్సి ఉందని పంచాయతీరాజ్ ఇంజనీర్లు జిల్లా కలెక్టర్కు వివరించారు. గ్రామంలో కల్వర్టు మంజూరు కోసం, 10 లక్షల రూపాయల వ్యయంతో సామాజిక గోకులం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలోని నందమూరి లక్ష్మయ్య వెంకటరావమ్మ సంస్మరణ గురుకుల వృత్తి విద్యా పాఠశాల, కళాశాల బాలుర బాలికల డార్మిటరీలను పరిశీలించారు. బాలికల డార్మెటరీలో దెబ్బతిన్న టాయిలెట్ బ్లాక్ పడగొట్టి నూతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పక్కనున్న బ్లాకుకు మరమ్మతులు చేయించాలన్నారు. విద్యాసంస్థలలో ఒకసారి పూర్తిగా పారిశుధ్యం చేపట్టాలని ఇదివరకే ఆదేశించామని, దాన్ని సజావుగా పర్యవేక్షించాలని ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, డిటిడబ్ల్యుఒ ఫణి ధూర్జటిని సెల్ఫోన్లో ఆదేశించారు. తదుపరి బాలుర



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

డార్మెటరీ సందర్శించి ఇక్కడ సీలింగ్ లో ఇనుప కడ్డీలు బయటపడి దెబ్బతిని ఉండటం పరిశీలించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త భవనం నిర్మాణానికి కూడా అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ పర్యటనలో ఎమ్మార్వో రవికాంత్, ఎంపీడీవో కే జ్యోతి, గ్రామ సర్పంచ్ దుర్గా శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఈఈ గోవిందరావు, డిఈలు సురేష్‌బాబు, సుందర్రావు, ఉప విద్య అధికారి పద్మారాణి, ఏపీఆర్జేసీ కళాశాల, పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకుమారి, బ్రాహ్మణేశ్వరి, ఏపీ ఆర్ఐఎస్ సొసైటీ డిప్యూటీ కార్యదర్శి సురేష్‌బాబు, వైద్యశాల డాక్టర్ విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్ పాల్గొన్నారు.



విజయలక్ష్మికి నివాళులర్పిస్తున్న తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి

విజయలక్ష్మికి పలువురు నివాళి


ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఈనెల 5వ తేదీన తుదిశ్వాస విడిచిన కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) అధినేత పురిటిపాటి కృష్ణారెడ్డి మాతృమూర్తి విజయలక్ష్మి సంస్మరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగింది. పలువురు ప్రముఖులు ఆమెకు ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ.రమణ, ఎపి శాసనసభ ఉప సభాపతి ఆర్.రఘురామకష్ణరాజు, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఎంపిలు సిఎం రమేష్, కె.రఘువీర్ రెడ్డి, డి.కె.అరుణ, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంఎల్ఎలు టి.హరీష్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, ప్రముఖ సినీనటులు చిరంజీవి, వెంకటేష్, మాజీ ఎంపిలు కె.వి.పి.రామచంద్ర రావు, జితేందర్ రెడ్డి, మధుయాష్కీ, తెలంగాణ హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సివి.ఆనంద్, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్, ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఎమ్‌డి వేమూరి రాధాకష్ణ, మై హోం గ్రూప్ సంస్థల చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు, వైసిపి నేత బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, టిడిపి నేత జెసి.పవన్‌రెడ్డి తదితర ప్రముఖులు విజయలక్ష్మికి నివాళులర్పించారు.

డోకిపర్రు గ్రామస్తుల అశ్రు నివాళి

విజయలక్ష్మి చిత్రపటానికి డోకిపర్రు గ్రామస్తులు పూలమాలలు వేసి అశ్రు నివాళులర్పించారు. మెయిల్ వారు నిర్వహిస్తున్న కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సిఎస్ఆర్) కింద గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో ఆమె కీలకపాత్ర పోషించారని కొనియాడారు. సామాన్యులకు అమె ఎన్నో సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. తమకు, తమ గ్రామానికి సేవలందించిన విజయలక్ష్మి తమకు దూరం కావటం తీరని లోటని అన్నారు.

రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం చైర్‌పర్సన్ మండవ జయదేవ్, కన్వీనర్ వైద్యులు స్వరూప ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఐడిబిఐ బ్యాంకు సహకారంతో ఆసుపత్రిలో జనరేటర్, షెడ్డు రూ.5 లక్షలతో ఏర్పాట్లు జరుగుతున్నాయని, విశ్వశాంతి కాలేజీ యాజమాన్యం



రూ.1.50 లక్షల విలువైన షెడ్డు నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సోలార్ సిస్టమ్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, అడ్వైజరీ కమిటీ సభ్యులు వినయ్‌కుమార్, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

వెంపటి చినసత్యం జయంతి

ప్రజాశక్తి-మొవ్వ: పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం 96వ జయంతిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళా పీఠంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన రచించిన నృత్యాంశములను విద్యార్థులు చేశారు. చిన్న సత్యం కాంస్య విగ్రహం వద్ద పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి కళా పీఠం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య పాల్గొన్నారు.



ఎక్సైజ్ సురక్ష యాప్‌ను వినియోగించాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : కల్తీ మద్యాన్ని నిర్మూలించేందుకు ఎక్సైజ్ శాఖ ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఉపయోగించి ప్రతి మద్యం బాటిల్‌ను తనిఖీ చేయొచ్చని మైలవరం ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ జె శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ యాప్ నందు లిక్కర్ సీసాలు మాత్రమే స్కాన్ చేసుకోవచ్చని, బీరు సీసాలు విషయంలో ఈ యాప్ ఉపయోగపడదనీ తెలిపారు. మూతపై ఉండే స్టికర్‌ను స్కాన్ చేసిన వెంటనే మద్యం బాటిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఏ షాప్‌నకు వచ్చింది, ఎంఆర్‌పి, బ్యాచ్ నెంబర్ వంటి తెలుస్తాయన్నారు. మద్యం వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నాణ్యమైన మద్యాన్ని పొందవచ్చని తెలిపారు.

కరపత్రాలు పంపిణీ



ప్రజాశక్తి-మైలవరం : భారత్‌పై అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మైలవరం, మరుసుమల్లి గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ రష్యా నుండి భారత్ ఆయిల్, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నామన్న కక్షతోనే అమెరికా అదనంగా 20 శాతం పన్నులు పెంచిందని, ట్రంప్ విధించిన సుంకాల వల్ల 7 లక్షల కోట్ల రూపాయలకుపైగా భారత ఎగుమతులపై ప్రభావం పడుతుందన్నారు. పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, పలు రంగాల కార్మికులు నష్టపోతారని, జిడిపి వద్ధిరేటు పూర్తిగా క్షీణిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకట్ రెడ్డి, జెట్టి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు మంద కృష్ణ, ఎస్ శివకృష్ణ, పాల్గొన్నారు.

లీగల్ చీఫ్ సెక్రటరీగా పల్లెపాటి



ప్రజాశక్తి - తిరువూరు : నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(జాతీయ మానవ హక్కుల కమిటీ) ఎన్టీఆర్ జిల్లా లీగల్ చీఫ్ సెక్రటరీగా నియమి తులైన న్యాయవాది పల్లెపాటి శ్రీనివాసరావును కాంగ్రెస్ పార్టీ తిరువూరు కార్యాలయంలో ఆ పార్టీ నేతలు బుధవారం ఘనంగా సన్మానించారు. సౌత్ ఇండియా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వైస్ చైర్మన్ గంజా కృష్ణమోహన్ సూచన మేరకు జాతీయ చైర్మన్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీనివాసరావు విలేకర్లకు తెలిపారు. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అంశం తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

దుర్గగుడి పాలకమండలి సభ్యురాలికి సన్మానం



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు మన్నె కళావతి దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవవస్థానం ఆలయ ధర్మకర్తల మండలి సభ్యురాలిగా నియమితులైన సందర్భంగా మంగళవారం రాత్రి అభినందన సభ నిర్వహించారు. నందిగామ మండలం జొన్నలగడ్డలోని వేమూరి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యేలు శ్రీ శ్రీరాం రాజగోపాల్, సౌమ్య పాల్గొని ఆమెను సన్మానించారు.

మద్యం షాపులు తనిఖీ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామలో పలు మద్యం షాపులను బుధవారం ఎక్సైజ్ శాఖ సీఐ ఎ రమాదేవి తనిఖీ చేశారు. మద్యం దుకాణదారులతో ఎక్సైజ్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ గురించి మద్యం దుకాణదారులకు అవగాహన కల్పించారు. మద్యం అమ్మకాలలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. అన్ని వైన్ షాపులు, బార్ల వద్ద క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మద్యం ప్రియులకు నాణ్యత మద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

సిపిఎం అభివృద్ధికి మధు సేవలు మరువలేనివి : బిఆర్



మధుసూదనరావుకు నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు తులసీరావు

ప్రజాశక్తి - తిరువూరు : సిపిఎం సీనియర్ నాయకులు నల్లమోలు మధుసూదనరావు పార్టీ నిర్వహించే ప్రజా ఉద్యమాలలో చురుగ్గా పాల్గొని మంచి కార్యకర్తగా ఎదిగారని ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు బి.ఆర్.తులసీరావు పేర్కొన్నారు. మధుసూదనరావు సంతాప సభ బుధవారం తిరువూరు సూర్యా రెస్టారెంట్ పంక్షన్ హాల్లో సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. తొలుత మధు చిత్ర పటానికి సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించి తిరువూరు ప్రాంతంలో సిపిఎం అభివృద్ధికి మధు ఎంతో కృషి చేశారని కొనియాడారు. తన చివరి శ్వాస వరకు పార్టీ కోసం నిబద్ధతతో పని చేశారని తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. తిరువూరు పట్టణంలో సామాన్యులపై పోలీసులు బనాయించే అక్రమ కేసులను అడ్డుకొని పేదలకు అడ్డాగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ఉప్పలపాటి లక్ష్మీదాసు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో అలుపెరుగని పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు పి.వెంకయ్య, నాగుల మీరా మాట్లాడుతూ మధు జీవిత విశేషాలను వివరించారు. ముందుగా ప్రజా నాట్యమండలి నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.తిరుపతిరావు, ఎం.నాగమణి, రాజేశ్వరి అమర వీరుల గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో మధు కుటుంబ సభ్యులు, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆట స్థలంలో ఆకమణలు తొలగించాలని ధర్నా



ప్రజాశక్తి -ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలం కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన ఆట స్థలంలో ఆక్రమణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు బుధవారం ధర్నా నిర్వహించారు. హైస్కూల్ ఆట స్థలాన్ని కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చిమటా వెంకటేశ్వరారవు మాట్లాడుతూ కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని ఆక్రమించి విద్యార్థులు ఆడుకోవడానికి స్థలం లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి ఐక్య ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బి.పెద్దబాబు, మండల నాయకులు కె.గణేష్, ఈ.చెన్నారావు, శ్రీనివాసరావు, జ్యోతి, వైష్ణవి, అవినాష్, వివేక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ రాకతో టెక్నాలజీ రంగం ఎంతగా అభివృద్ధి చెందిందో, అదే విధంగా విశాఖలో గూగుల్ రాక రాష్ట్ర భవిష్యత్తుకు గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిసిఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గంలో పత్తి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.8,110 ధరతో పత్తిని కొనుగోలు చేయాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం జగ్గయ్యపేట పట్టణంలోని వైయస్ఆర్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర ప్రకారం పత్తి క్వింటాకు 8,110 రూపాయలతో వ్యవసాయ అధికారులు రైతుల నుండి కొనుగోలు చేసి దళారీల వ్యవస్థ నుండి కాపాడాలని కోరారు.

27 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని, ఈ నెల 17వ తేదీ నుండి మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు జగ్గయ్యపేట వ్యవసాయ సంచాలకులు సి భవాని తెలిపారు. మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో కలిసి ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వి వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

తిరువూరు ఇన్చార్జ తహశీల్దార్‌గా నాగమణి

ప్రజాశక్తి - తిరువూరు : డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న వై.నాగమణిని తిరువూరు ఇన్‌ఛార్జ్ తహశీల్దార్‌గా నియ మిస్తూ కలెక్టర్ లక్మిశా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహశీల్దార్ ఉదయ భాస్కరరావు అనారోగ్య సమస్య కారణంగా నెల రోజులు సెలవులో ఉన్నందున నవంబర్ 14 వరకు నాగమణికి ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేటలో స్థానిక దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు స్థలాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాశీల్దార్ కె లక్ష్మి కళ్యాణి, పిఎస్ఐ ఉమామహేశ్వర రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి భరత్ భూషణ్, ఆర్ఐ సుజాత సిబ్బంది మరియు దీపావళి దుకాణాల నిర్వహకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-కంచికచర్ల : గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది సంఘటన మండల కేంద్రమైన కంచికచర్ల బైపాస్‌లో రోడ్డులో బుధవారం జరిగింది.. కంచికచర్ల ఎస్ఐ విశ్వనాధ్ అందించిన వివరాల ప్రకారం.. కంచికచర్ల శివ సాయి క్షేత్రం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న కంచికచర్లకు చెందిన కూరపాటి సరస్వతి (65) అనే మహిళను విజయవాడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలతో సరస్వతి అక్కడికక్కడే మతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విశ్వనాధ్ తెలిపారు.

17న విశ్వ భారతి కళాశాలలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని జేఆర్‌సి విశ్వభారతి డిగ్రీ కాలేజీలో ఈ నెల 17న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కెమిస్ట్రీ (బిజెడ్‌సి, ఎంపిసి) సబ్జెక్టులో ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతకు కోహన్స్ కెమికల్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హత, అవకాశం కలిగిన విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరై తమ కెరీర్‌ను మెరుగైన దిశలో ముందుకు తీసుకెళ్లగలరు. వివరాలకు 98483 83398 సంప్రదించగలరు.

టిడిపిని వీడిన వెంకటేశ్వరరావు



ప్రజాశక్తి-విస్సన్నపేట: విసన్నపేట మండలం తాతకుంట్ల గ్రామం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ కాంట్రాక్టర్ లయన్ డాక్టర్ ఎన్‌టి వెంకటేశ్వరరావు పార్టీ నుండి తప్పుకుంటున్నట్లు బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి బాగానే ఉందని, స్థానికంగా పార్టీలో కొని చీడపురుగులు ఎక్కువయ్యాయని, వాటి వలన ఆర్థికంగా.. మానసికంగా చాలా ఇబ్బంది పడుతున్నానని తెలిపారు. అందుకే పార్టీ నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి



ప్రజాశక్తి-మైలవరం : దేశానికి అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతిని జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. మైలవరంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వేసినివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా తెలియజేసిన ఘనత కలాంకె దక్కుతుందన్నారు.

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తన నివాసంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా మాత్రమే కాకుండా అసాధారణ వ్యక్తిత్వం కలిగిన మహానుభావుడిగా భారత చరిత్రలో అబ్ధుల్ కలాం చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగ్గయ్యపేటలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పాత మున్సిపల్ ఆఫీసు సెంటర్‌లో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పాల్గొన్నారు.

పలుచోట్ల అబ్దుల్ కలాం జయంతి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: దేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి డా. ఏపిజె అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కృష్ణా విశ్వవిద్యాలయం సెంట్రల్ లైబ్రరీలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, ఇంజనీరింగ్ డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ, పరీక్షల నియంత్రణ అధికారి డా. పి.వీరబ్రహ్మాచారి, డా.పద్మజ పాల్గొన్నారు.

కృష్ణా యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.రాంజీ, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష మాట్లాడుతూ కలాం జీవిత చరిత్ర నేటి తరానికి పాఠ్యాంశంగా ఉండాలని, నేటితరం ఆయన జీవన శైలిని



అనుసరించడానికి ప్రయత్నించాలని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా ఆర్.విజయకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. పి.గోపి, ఆర్.దుర్గాప్రసాద్, కె.కవిత పాల్గొన్నారు.

అవనిగడ్డ: గాంధీక్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అబ్దుల్ కలాం విగ్రహానికి మండలి వెంకట్రావు పూలదండలు వేసి నివాళులర్పించారు. గాంధీ క్షేత్రం కార్యదర్శి మతి శ్రీనివాసరావు, బండే రాఘవ, మండలి రామ్మోహన్రావు, కొత్తపేట పిఎసిఎస్ అధ్యక్షులు ఎలవర్తి చిన్న తదితరులు పాల్గొన్నారు. వైసిపి కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఆ పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు శివారు స్వతంత్రపురం గ్రామంలో రోడ్డు అభివృద్ధికి కోడూరు మండల టిడిపి నేతలు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. రోడ్డుకి ఇరు ప్రక్కల పిచ్చి మొక్కలతో నిండి రోడ్డు పై నీరు నిలుస్తుందని, దానివల్ల నడిచేందుకు ఇబ్బందిగా ఉందని, రోడ్డు అభివద్ధి పరచమని, గ్రామస్థుల అభ్యర్థన స్థానిక టిడిపి నేతలైన వీరంకి వెంకటేశ్వరరావు, బొడ్డు వెంకన్న,మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు తమ సొంత ఖర్చులతో బుధవారం జేసీబీ సహాయంతో జంగిల్ క్లియరెన్స్, రోడ్డు లెవల్ పనులు చేయించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

అంగన్వాడీలో వేడుకలు

ప్రజాశక్తి-కంకిపాడు: పోరంకి సాలిపేట అంగన్వాడి కేంద్రంలో సామాజిక వేడుకల్లో భాగంగా చంటి పిల్లలకు ఉయ్యాల, అన్నప్రాసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ బేబీ సుకన్య మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలకు ఆరు నెలల నిండిన దగ్గర నుండి తీసుకోవలసిన పోషకాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్మలకుమారి, సూపర్వైజర్ జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.



'కేంద్ర ప్రభుత్వం గద్దె దిగాలి'

ప్రజాశక్తి-అవనిగడ్డ: కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఓట్ల చోరీ ద్వారా అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నం చేస్తుందని, అటువంటి ప్రభుత్వం అధికారంలో కొనసాగే అర్హత లేదని పీసీసీ ఓబీసీ ఛైర్మన్ సొంటి నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ అందే శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమాలకు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో కూడా ఓట్ల చోరీపై ప్రచారం నిర్వహించనున్నట్లు చెప్పారు. అందే శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్



పార్టీ సత్తా చాటుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాగితాల సుదర్శన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్, వివిధ మండలాల అధ్యక్షులు నరహరిశెట్టి శ్రీమన్నారాయణ, అందే లెనిన్, వెంకటేశ్వరరావు, అర్జ నాగేంద్ర, అద్దంకి సుధాకర్రావు, లంకె ఆంజనేయ వర్మ, మహిళా నాయకురాలు జరుగు నాగరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ మద్యంలో పేర్ని నాని పాత్రపై విచారించాలి'

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని పాత్రపై తమకు ఎన్నో అనుమానాలు ఉన్నాయని బందరు మండల టిడిపి నాయకులు పేర్కొన్నారు. పేర్ని నాని పాత్రపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బుధవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచే దుర్గా ప్రసాద్ (నాని), తెలుగు రైతు విభాగం జిల్లా అధ్యక్షులు గోపు సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు కాగిత గోపాలరావు, ప్రధాన కార్యదర్శి కాటం మధుసూదనరావు, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, టీడీపీ క్లస్టర్ ఇన్ ఛార్జ్ లంకే శేషగిరిరావు మాట్లాడుతూ కల్తీ మద్యం కేసు నమోదైన రోజు నుండి రోజుకొక నాటకీయ పరిణామాలతో పేర్ని నాని వ్యవహరించి కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ కేసులో అసలు నిందితుడు మాజీ మంత్రి జోగి రమేష్ను తప్పించేందుకు పేర్ని నాని మొదటి నుండి వ్యూహాత్మకంగా వ్యవహరించి కల్తీ మద్యం మరకలను టిడిపి ప్రభుత్వానికి అంటించే ప్రయత్నం చేశారన్నారు. ఎక్సైజ్ శాఖను సమర్ధవంతంగా నడిపిస్తున్న మంత్రి కొల్లు రవీంద్రపై పేర్ని నాని చేసిన వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.





పాఠశాలకు కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి-పమిడిముక్కల: దాతల సహకారంతో ఐనపూడి ఉన్నత పాఠశాల అభివృద్ధి పథంలో నడుస్తుందని ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు అన్నారు. బుధవారం దొడ్డ సూర్య వెంకటప్రసాద్ 15 వేల రూపాయలు విలువ చేసే కుర్చీలను పాఠశాలకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కూడేరు గ్రామ సర్పంచ్ వేర్ల నాగరాజ, బసివిరెడ్డి, ఎఎంసి చైర్మన్ దూడల శివనాగభవాని పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0పై ర్యాలీ

ప్రజాశక్తి-ఉయ్యూరు: సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్స్పై ఉయ్యూరు మండల డ్వాక్రా మహిళలు కృతజ్ఞత ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల డ్వాక్రా కుటుంబ సభ్యులకు పొదుపు ప్రయోజనాలు అందుతున్నాయన్నారు.

బాణసంచా దుకాణాలకు బీమా తప్పనిసరి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): దీపావళి సందర్భముగా మందుగుండు సామగ్రి అమ్మేందుకు షాపులు ఏర్పాటు చేసే వ్యక్తులు తప్పని సరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని అలా చేయించుకుంటేనే షాపులు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని బందరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె .స్వాతి స్పష్టం చేశారు. బుధవారం రెవెన్యూ డివిజనల్ అధికారి ఛాంబర్ లో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆర్ డి ఓ మాట్లాడుతూ మందు గుండు సామగ్రి అమ్ముకొనుటక తాత్కాలిక అనుమతి నిమిత్తం ఈ నెల 17 తేదీ సాయంత్రం 5.00 గం.లలోపు అర్జీ దాఖలు చేయలని తరువాత వచ్చిన అర్జీలు పరిగణలోకి తీసుకొనబడవన్నారు.ఆర్జీలను సంబంధిత తహాశీల్దార్ వారి కార్యాలయములో సమర్పించాలన్నారు. అర్జీతో పాటుగా అర్జీదారుని ఫోటో, ఆధార్ కార్డు నకలు, జిఎస్టి (సెల్స్ ట్యాక్స్) అధికారుల నుండి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జతపరచాలన్నారు. ఒక్కరు ఒక దరఖాస్తు మాత్రమే చేయలన్నారు. రెండు రోజులకు మాత్రమే తాత్కాలిక లైసెన్సులు ఇవ్వడం జరుగుతుందన్నారు. షాపులను రేకుల షెడ్ నందు మాత్రమే ఏర్పాటు చేయలని. అలాగే షాపు దారులు వాటర్ డ్రమ్ములు, అసుక మూటలు వారే ఏర్పచుకొవలన్నారు. ప్రతీ షాపుకు 3 మీటర్ల దూరం



మరియు ఎదురెదురు షాపులు 15 మీటర్ల దూరం ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇచ్చిన పర్మిట్ మేరకు మాత్రమే షాపులలో మందుగుండు సామగ్రి ఏర్పాటు చేసుకోవాలన్నారు.

స్త్రీశక్తితో 13 లక్షల మందికి లబ్ధి

ఆర్‌టిసి అవనిగడ్డ డిఎం హనుమంతరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ: స్త్రీ శక్తి మహిళల ఉచిత బస్సు ప్రయాణం అవనిగడ్డ ఆర్టీసీ డిపో ద్వారా విజయవంతంగా కొనసాగుతుందని డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆయన డిపో కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రెండు నెలలు పూర్తి అయిందని డిపో పరిధిలో మొత్తం 20 లక్షల 70 వేల 57 మంది ప్రయాణికులు ప్రయాణం చేయగా అవనిగడ్డ డిపో బస్సులలో ఇప్పటివరకు 13 లక్షల 54 వేల 24 మంది మహిళలు 65.41 శాతం ఉచిత ప్రయాణం చేసి రూ 4,71,09,410 మేర ఆర్థికంగా లబ్ధి పొందారని తెలిపారు. అవనిగడ్డ డిపో పరిధిలో మహిళలు అధిక సంఖ్యలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుని లబ్ధి పొందారన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాటర్ కూలర్ బహూకరణ

ప్రజాశక్తి-కంకిపాడు: మండల టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్బాబు ఐసిడిఎస్ కార్యాలయానికి వాటర్ కూలర్ను బుధవారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సూదులగంటి అన్నామణి, రాఘవమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అవ్వారుకు సత్కారం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: బిసి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ కోశాధికారి అవ్వారు శ్రీనివాసరావు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్గా నియమితులైన సందర్భంగా సంఘ అధ్యక్షులు డాక్టర్ ఎన్వీరావ్ అధ్యక్షతన సత్కారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, పట్నాయక్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ తాతాజీ, హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు రాధాకృష్ణ, బీసీ నాయకులు వేముల వెంకట్రావు పాల్గొన్నారు.



ఉత్సాహంగా కంప్యూటర్ ఫెస్ట్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అడుసుమల్లి గోపాలకృష్ణయ్య, షుగర్కేన్ గ్రోవర్స్ సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, ఉయ్యూరు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆర్వుటి 2కె25- కంప్యూటర్ ఫెస్ట్ అంతర్- కళాశాల సాంకేతిక ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో వివిధ సాంకేతిక మరియు అసాంకేతిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. వాటిలో టెక్ క్విజ్, డంబ్ స్మాష్, మూవీ క్విజ్, ఫోటోగ్రఫీ, ప్రాజెక్ట్ ఎక్స్పో, పోస్టర్ ప్రెజెంటేషన్, ట్రెజర్ హంట్, స్టాండ్-అప్ కామెడీ, సోలో సింగింగ్, డ్యాన్స్ పోటీలు వంటి విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. పీ.బి. సిద్ధార్థ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్, విజయవాడ నుండి ఎంసీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరచి పలు బహుమతులను గెలుచుకున్నారు. విజేతలను కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తదితరులు అభినందించారు.



12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-ఉంగుటూరు: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి జి.రమేష్ తెలిపారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో రమేష్ మాట్లాడుతూ మండలంలో పిఎసిఎస్‌ల ద్వారా 10 కేంద్రాలలోనూ, మిగిలిన రెండు కేంద్రాలను డీసీఎంఎస్ ద్వారానూ మొత్తం 12 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఒక డీఇఓ (డేటా ఎంట్రీ ఆపరేటర్), టిఎ (టెక్నికల్ అసిస్టెంట్) ఒక హెల్పర్ ఉంటారని తెలిపారు.



ఉపాధి కార్మికులకు ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ : ఉపాధి కూలీలందరికీ ఈకేవైసీ పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్, ఐవిఆర్ఎస్ నివేదిక, వసతి గృహాలపై డిఎల్‌డిఓలు, ఎంపీడీవోలు, వసతి గృహాల ప్రత్యేక అధికారులతో బుధవారం దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నవంబర్ నుంచి ఉపాధి హామీ పనులకు బయోమెట్రిక్ విధానం తప్పనిసరి, అందువల్ల ఉపాధి శ్రామికులందరికీ ఈకేవైసీ పూర్తి చేయాలని చెప్పారు. టెండర్లతో సంబంధం లేకుండా పశువుల షెడ్లను స్వయంగా నిర్మించుకోవచ్చని, అయితే బిల్లు విలువ రూ.50 వేలకు మించరాదని చెప్పారు. స్వయంగా నిర్మించుకోలేని వారికి టెండర్ల ద్వారా వెండర్ ను ఎంపిక చేయాలని చెప్పారు. గ్రామపంచాయతీలో చెత్త సేకరణపై ప్రజల నుంచి పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం కావడం లేదని, దీనికి గల కారణాలను అన్వేషించాలని చెప్పారు. జిల్లాలో ముక్త్యేశ్వరపురం, సుబ్బయ్య గూడెం, పాతపాడు, రాయనపాడు, పొందుగల గ్రామపంచాయతీలు చెత్త సేకరణలో టాప్ ఫైవ్‌లో ఉన్నాయని అభినందించారు. సంక్షేమ వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యత, మంచినీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించాలని, దీనికై ప్రత్యేక అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని చెప్పారు. నీటి నాణ్యత నిర్ధారించడానికి ప్రతి సంక్షేమ వసతి గృహానికి క్లోరిన్ కిట్లను ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఏ.రాము, డిపిఒ లావణ్య కుమారి, డి ఎల్ డి వో లు పి.శ్రీనివాసరావు, పార్థసారథి, బి. ఎన్.లక్ష్మీకుమారి, డివిజనల్ పంచాయితీ అధికారి జి.రాఘవన్ పాల్గొన్నారు.

జాతీయ కరాటే ఓవరాల్ చాంప్‌గా సెయింట్ ఆన్స్

ప్రజాశక్తి - తిరువూరు : జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీలలో తిరువూరు సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుని ఆంధ్రప్రదేశ్కు ఘన విజయం సాధించినట్లు కరాటే సీనియర్ కోచ్ ఏపి చీఫ్ మోతే నాగేశ్వర రావు తెలిపారు. ఈనెల 11, 12 తేదీలలో తమిళనాడులోని చెన్నై పట్టణంలో గల జైన్ కళాశాలలో కరాటే ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీలు జరిగినట్లు చెప్పారు. 15 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో పోటీపడిన సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకొని రాష్ట్రానికి కీర్తిని తీసుకొచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో విజేతలను ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రీతి, కరస్పాండెంట్ జ్యోత్స్న, లిల్లీ, మెర్సీ అభినందించారు.



ఘనంగా గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడలోని పున్నమి ఘాట్ లో జరుగుతున్న గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు బుధవారం రాత్రి నిర్వహించిన లక్కీ డీప్‌లో విజేతలకు కలెక్టర్ జి.లక్ష్మీశ బహుమతులు అందజేశారు. భవానీపురం పున్నమి ఘాట్లో ఈ నెల 19 వరకు అమరావతి షాపింగ్ ఫెస్టివల్ వేడుకలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ శిల్ప బజార్‌కు స్పందన

- ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలి: లేపాక్షి విసి



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశ సాంస్కృతిక వైభవానికి చిహ్నాలైన చేనేత, హస్తకళా ఉత్పత్తుల విశిష్ట సంపదను భావితరాలకు అందించాలనే ప్రయత్నంలో భాగంగా నగరంలో ఈ నెల 10న ప్రారంభించిన గాంధీ శిల్ప బజార్‌కు విశేష స్పందన లభిస్తోందని.. దేశవ్యాప్త హస్తకళా ఉత్పత్తులు ఒకే వేదికపై అందుబాటులో ఉన్న శిల్ప బజార్ ఈ నెల 19వ తేదీ వరకు మరో నాలుగు రోజులే అందుబాటులో ఉంటుందని, ఔత్సాహికులు సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలని లేపాక్షి విసి, ఎండి ఎండీ ఎం.విశ్వ బుధవారం తెలిపారు. విజయవాడ పటమట ఎన్‌టిఆర్ సర్కిల్ సమీపంలోని మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో అఖిల భారత హస్తకళా వస్తువులు, కళాత్మక వస్త్ర ప్రదర్శన, అమ్మకం వేదిక గాంధీ శిల్ప బజార్‌లో దేశ వ్యాప్తంగా హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై తీసుకువచ్చి ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కమిషనర్ సహకారంతో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప బజార్‌లో మంగళగిరి, పోచంపల్లి, వెంకటగిరి, గద్వాల్, సిద్దిపేట్, నారాయణపేట్, చీరాల, కలంకారి, బాటిక్ ప్రింటింగ్, బెంగాలీ కాటన్, కాశ్మీరీ సిల్క్, కోసా సిల్క్స్, మధురై, లక్నో చికన్ వర్క్, నారాయణవరం, గాగ్రా చోళీ, కాటన్ ప్రింటెడ్, సంబల్పూర్, కోసా (టస్సర్), అప్లిక్ వర్క్, ప్యాచ్ వర్క్, ఖాదీ మెటీరియల్, బెడ్ షీట్స్ వంటివి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు గాంధీ శిల్ప బజార్ అందుబాటులో ఉంటుందని, రూ. కోటి విలువైన అమ్మకాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ. 40 లక్షల విలువైన వస్తువులను ఔత్సాహికులు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

స్వర్గపురిలో మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ : స్వర్గపురిలో స్నానపు గదులు, మరుగుదొడ్లు మరమ్మతులు చేయాలని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం కృష్ణలంక ప్రాంతంలోని మలేరియా ఆఫీస్ రోడ్డు, మస్జిద్ రోడ్డు, గంగానమ్మ గుడి, హై స్కూల్ రోడ్ పటమట ప్రాంతాలను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వర్గపురిలో మొక్కలు పెంచాలని, స్నాన గదులు, మరుగుదొడ్లు, స్వర్గపురిలో వచ్చే వారికి కావాల్సిన కనీస అవసరాలు తీర్చేటట్లు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటమటలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె షమ్మీ, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎబిఐయస్‌యస్ జిల్లా అధ్యక్షునిగా బాలాజీ నాయక్



విజయవాడ : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఎబిఐయస్‌యస్) ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులుగా జటావత బాలాజీ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఎబిఐయస్‌యస్ సమావేశం ఈ నెల 12న జరిగింది. ఈ సమావేశానికి ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.చక్రీ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.రాంబాబు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ఎన్‌టిఆర్ జిల్లా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నూతన అధ్యక్షులుగా బాలాజీ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. త్వరలోనే జిల్లాలో పర్యటించి బంజారాల న్యాయమైన హక్కుల కోసం పోరాడతానని తెలిపారు. అదేవిధంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధారావతు బాలాజీ నాయక్‌ను ఎన్నుకున్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న రాధేశ్యాం, నర్తకీమణులు



నృత్యాంశాలతో నీరాజనం అర్పిస్తున్న వందలాది బాల నర్తకీమణులు

ఘనంగా వెంపటి చిన సత్యం జయంతి

- బ్రహ్మాంజలి ఘటించిన బాల నర్తకీమణులు

విజయవాడ : తెలుగు జాతి గర్వించదగిన ప్రఖ్యాత నాట్య విద్వాంసులు పద్మభూషణ్ వెంపటి చిన సత్యం 93వ జయంతి కార్యక్రమం విజయవాడ శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ఆవరణలో బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, అమరావతి శాస్త్రీయ నాట్యాచారుల సంఘం, శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు నృత్య కళాశాల విజయవాడ- సంయుక్త నిర్వహణలో... అమరావతి ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలల విద్యార్థులు వందల సంఖ్యలో బాల నర్తకీమణులు వెంపటి వారికి బ్రహ్మాంజలి, జతిస్వరం, హిందోళరాగం, థిల్లానా శతుల్లో పాటలకు పలు నృత్యాంశాలతో ఘనంగా నీరాజనం అర్పించారు. వేదాంతం పార్థసారథి, దేవరకొండ చంద్రశేఖర్, చదలవాడ ఆనంద్, పద్మశ్రీ హేమంత్, జి. శైలశ్రీ, అనూరాధ, ఎం.త్రినాథాచారి సహ దాదాపు 30 మంది గురువుల ఆధ్వర్యంలో గ్రౌండ్లో నృత్యాలు హృద్యంగా సాగాయి. కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యాం ముఖ్య అతిథిగా, శ్రీ సిద్ధేంద్ర యోగి కళాపీఠం, కూచిపూడి వైస్ ప్రిన్సిపాల్ చింతా రామకృష్ణ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. తొలుత శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ సి. జ్యోతిర్మయి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయన శ్రీనివాసరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఆర్‌యుబి వెడల్పు పది మీటర్లు ఉండాలి

- రెండో ఫ్లైఓవర్ సాధన కమిటీ కన్వీనర్ ఆంజనేయులు



ప్రజాశక్తి-విజయవాడ : వాంబే కాలనీ- మధురానగర్ మధ్య రైల్వే ట్రాక్ క్రింద నిర్మించ తలపెట్టిన అండర్ పాస్ (ఆర్‌యుబి) కనీసం 10 మీటర్లు వెడల్పు ఉండాలని సింగ్‌నగర్ రెండవ ఫ్లై ఓవర్ సాధన కమిటీ కన్వీనర్ ఎంవి ఆంజనేయులు కోరారు. ఈ మేరకు విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్‌కు రెండవ ఫ్లై ఓవర్ సాధన కమిటీ ప్రతినిధులు ఒక మెమొరాండం అందజేశారు. ఆ వివరాలను స్థానిక శోభనాద్రి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగరంలో వాహనాల సంఖ్య భారీగా పెరగటంతో సింగ్‌నగర్ ఏరియాలో ప్రస్తుతమున్న ఫ్లై ఓవర్ సరిపోవటం లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రస్తుతమున్న ఫ్లై ఓవర్‌కు అదనంగా సింగ్ నగర్ ఏరియాలో మరో ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరారు. వాంబే కాలనీ వద్ద అండర్ పాస్ (ఆర్‌యుబి) వేయాలని 2023 మార్చి నుండి రెండవ ఫ్లై ఓవర్ సాధన కమిటీ పోరాడుతుందన్నారు. రెండవ ఫ్లై ఓవర్ సాధన కమిటీ మెమొరాండాలకు రైల్వే శాఖ స్పందించిందని, రెండవ ఫ్లై ఓవర్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిపాదన రావాలని అన్నారన్నారు. వాంబేకాలనీ వద్ద నిర్మించ తలపెట్టిన ఎల్‌హెచ్ఎస్ వెడల్పు 4 మీటర్లు చాలదని, కనీసం 10 మీటర్లు ఉండాలని, అప్పుడే సింగ్ నగర్, పాయకాపురం ఏరియాల నుండి వచ్చే ట్రాఫిక్ స్వేచ్ఛగా వెళ్లగలుగుతుందని కోరుతూ రెండవ ఫ్లై ఓవర్ సాధన కమిటీ మరో లేఖ ద్వారా రైల్వేశాఖను కోరిందన్నారు. రెండవ ఫ్లై ఓవర్ సాధన కమిటీ ప్రతినిధులు సోమవారం (13న) మరోమారు ఎంపిని కలిశారని, ఎల్‌హెచ్ఎస్ వెడల్పు కనీసం 10 మీటర్లు ఉండేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశామన్నారు. దీనితోబాటుగా సింగ్ నగర్ వద్ద రెండవ ఫ్లై ఓవర్ నిర్మాణానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిపాదన వెళ్ళే విధంగా కృషి చేయాలని కోరిందని తెలిపారు. టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి సాంబిరెడ్డి, పౌరసంక్షేమ సంఘం నాయకులు ఎ పున్నారావు, టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ ట్రెజరర్ విఎస్ రామరాజు, ఉడాకాలనీ ఐడబ్ల్యుఎస్ నాయకులు కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' విజయవంతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ : ఈ నెల 18న స్వచ్ఛమైన గాలి (క్లీన్ ఎయిర్) ఇతివృత్తంతో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల విజయవంతానికి ప్రణాళికాయుత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. జిల్లా, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి కాలుష్యం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ, సౌర విద్యుత్ వినియోగం వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. నిత్య జీవిత ప్రయాణాన్ని పర్యావరణహిత మార్గంలో సాగించేలా అవగాహన కల్పించాలని, హానికర టపాసులు కాకుండా దీపాల కాంతులతో పర్యావరణహిత దీపావళిని జరుపుకుందామని అధికారులు, సిబ్బందికి పిలుపునిచ్చారు.